

# ప్రాణం ఖరీదు వంద ఒంటెలు

పెద్దింటి అశోక్‌కుమార్

ఈ వారంలో ఎన్ని వందలసార్లు ఇలా అనుకుందో తెలియదుకాని కళ్లు మూసుకుంటూ మరోసారి, 'నేను వాళ్లను క్షమించనుగాక క్షమించను,' అనుకుంది సావిత్రి. అలా అనుకున్న మరుక్షణమే ఎప్పటిలాగే, 'మరి చంద్రంను మోసం చెయ్యడం లేదు కదా,' అనిపించింది.

వెంటనే, 'పిల్లగాడు. నాలో రాజుకున్న అగ్గి వానికేం తెలుసు,' తనకు తాను చెప్పుకుంది.

అది దుబాయి ఏడారిలోని లేబర్ క్యాంప్‌లో ఓ గది.

నాసిరకం ఏసి మిషన్ తాచుపాములా బుసకొడుతుంది. మధ్యలో వేలాడదీసిన బెడ్‌లైట్ తనను తాను వెలిగించుకుంటుంది.

ఎంత ప్రయత్నించినా సావిత్రికి నిద్రరావడంలేదు. ఆరుగంటల విమాన ప్రయాణం తరువాత ఆ గమనస్థితి ఇంకా పోలేదు. ఒళ్లు గాలిలో తేలుతున్నట్టుగానే ఉంది. ఒకసారి అటు నుంచి ఇటు తిరిగి దుప్పటి కప్పుకుంటూ చంద్రంను చూసింది.

అతడింకా నిద్రపోలేదని గమనించి, "దియా అంటే ఏందిరా," అడిగింది సావిత్రి

'బ్లడ్ మనీ,' చంద్రం జవాబు.

'అంటే...???'

'రక్తపు రొక్కం. చనిపోయిన మనిషికి ఇచ్చే నష్ట పరిహారం.'

'మరి ఒంటెలు ఎందుకురా...' అడిగింది సావిత్రి.

చంద్రం విచిత్రంగా చూశాడు. రేపు కోర్టులో జడ్జి ముందు ఏం చెబుతుందా అన్న భయం వేసింది. దియా గురించి ఇంటివద్ద చెప్పాడు. వస్తూ వస్తూ ప్లేన్‌లో కూడా వివరంగా చెప్పాడు. ఇప్పుడు మళ్లీ కొత్తగా అడుగుతుంటే విసుగు పుట్టింది. అయినా ఓపికగా చెప్పాడు.

'ఇక్కడ షరియత్ చట్టాలు పెద్దమ్మా... తప్పుకు శిక్షలు వేరుగా ఉంటయి. కాలుకు కాలు. చెయ్యికి చెయ్యి, ప్రాణం తీస్తే ప్రాణం. హత్య కేసుల్లో మాత్రం ఒక వెసులుబాటు ఉంటది. చనిపోయిన వ్యక్తి కుటుంబం క్షమాబిక్ష పెడితే చంపిన వ్యక్తిని ఉరి తీయకుండా వదిలి పెడుతరు. దానికి అతను ఈ కుటుంబాకి వంద ఒంటెలు ఇయ్యాలె. ఒకప్పుడు అరబ్బులకు బతుకే ఒంటెలు గదా... లెక్క అట్ల గట్టిండ్రు. ఇప్పుడు ఒంటెలు లెవ్వుగదా... డబ్బు ఇస్తుండ్రు," ఎంత వద్దనుకున్నా మాటల్లో విసుగు.

"ప్రాణం ఖరీదు ఇక్కడ ఇంత చవకనా..." బాధగా అన్నది సావిత్రి.

చంద్రంకు నవ్వు వచ్చింది. 'పెద్దమ్మ ఇంతకంటే ఎక్కువ డబ్బు ఆశిస్తుందా,' అన్న అనుమానం కూడా కలిగింది.

"వంద రూపాయలకు కూడ హత్యలు జరుగుతున్నయి పెద్దమ్మా... ఇక్కడ కాదు ఎక్కడైనా ప్రాణాలు చవకనే," అనబోతుంటే సావిత్రే అడ్డుతగిలి దీర్ఘంగా నిట్టూరుస్తూ, "అవున్రా... తలలకు ప్రభుత్వాలే వెలలు గడుతున్నయి గదా," అన్నది.

రాత్రి ఒంటి గంట దాటిందనడానికి గుర్తుగా బల్దియా సెక్యూరిటీ వ్యాన్ సైరన్ మోత. ఆ మోత వినగానే చంద్రంకు నాగరాజు గుర్తొచ్చాడు. పీడకల లాంటి ఆ చావు గుర్తొచ్చింది. భయంగా దుప్పటి కప్ప

కుంటూ, "వంద ఒంటెలంటే తక్కువేంగాదు పెద్దమ్మా... ఇరువై అయిదు లక్షలు," అన్నాడు.

"నా కొడుకు నాగరాజు పాణం వెల ఇరువై ఐదు లక్షలన్నట్టు," గొనిగినట్టుగా అన్నది సావిత్రి.

"ఇంకా ఈ దుబాయ్‌లో నయం పెద్దమ్మా... ఈ మాత్రం ఇత్తుండ్రు. ఇదే సౌదీలనో కత్తర్‌లనో అయితే ముస్లీంలకే ఈ రేటు. మనకు ఇందులో సగమే. ఆడోళ్ల కైతే సగంల సగమే..." అన్నాడు చంద్రం.

'పాణం పోయినంక ఈ పాపపు పైసలు ఎందు కురా... నేను ముట్టనుగాక ముట్టను.' మనసులో మరోసారి గట్టిగా అనుకుంది సావిత్రి.

"పెద్దమ్మా... రేపు కోర్టుల జడ్జి ఒకటికి రెండుసార్లు అడుగుతడు. ఎప్పుడు అడిగినా 'తానాజిల్' అని ఒక్కటే మాట చెప్పాలె. అంటే నేను దియాకు ఒప్పుకుని అతన్ని క్షమిస్తున్నా అన్నట్టు," మరోసారి గుర్తుచేశాడు చంద్రం.

'లేదు... అట్ల చెప్పనే చెప్ప. నా కొడుకును చంపినవాన్ని విడిచిపెట్టద్దు అంట. కసాస్... కసాస్ అంట,' కసిగా అనుకుంది సావిత్రి.

ఆమె మౌనంగా ఉండడంతో అనుమానంగా గొంతు పెంచి, "పెద్దమ్మా... విన్నవా," అన్నాడు చంద్రం.

"ఆ... సరేరా..." అన్నది సావిత్రి కళ్లు మూసు కుంటూ.

మూసుకున్న కళ్ల వెనుక గతం నీడలా కదిలింది. తండ్రి మరణం, భర్త మరణం, కొడుకు మరణం, ఈ మరణాల వెనక ఉన్న కారణాలు గుర్తుకు వస్తున్నాయి. ఓ అయిదారేండ్లు తన కొడుకు ఇదే గదిలో ఉన్నాడన్న భావన రాత్రి నుండి మనుసును కుదిపేస్తుంది. గదిలోకి అడుగుపెట్టగానే తనివితీరా ఏడ్వాలనుకుంది. ఏడుపు రాలేదు కాని గుండె మాత్రం బరువుగా ఉంది.

"పెద్దమ్మా... లోపలికి ఎవ్వలను రానియ్యరు. వాళ్ల తరపున ఒకరిని, నిన్ను ఇద్దరినే పిలుస్తరు. వాళ్ల తరపున వాళ్ల తల్లి వచ్చింది. జడ్జీలు నిన్ను రెండే రెండు మాటలు అడుగుతరు..." చెప్పడం ఆపి సావిత్రివైపు చూసాడు చంద్రం. ఆమె కదలకుండా ఉండడంతో పడుకుందనుకుని తానూ కళ్లు మూసుకున్నాడు. నీళ్లు ఇంకిన గాజుకళ్లతో సావిత్రి మాత్రం టార్ఫాలిన్ గుడ్డతో కట్టిన పై కప్పునే చూస్తుంది.

'నేను తండ్రితో అక్షరాలు చదవడం నేర్చుకున్న. భర్తతో సమాజం చదవడం నేర్చుకున్న. కొడుకుతో బతుకు ఈదడం నేర్చుకున్న. నేను పిల్లాపాపలతో ఓ సాధారణ జీవితం గడపాలనుకున్న. ఆ జాగ్రత్తలోనే అన్ని కష్టాలు తెచ్చుకున్న జనం తండ్రిని పొగిడితే గర్వపడ్డ. భర్తను పొగిడితే భయపడ్డ. కొడుకును పొగిడితే జాగ్రత్త పడ్డ. అయినా జరగాల్సింది జరిగింది. ఈ మూడు తరాలుగా నన్ను వెంటపడి వేదించింది ఎవరు? నా కుటుంబాన్ని ఊరికి దూరం చేసింది ఎవరు? నా ఊరి లోనే నన్ను పరాయిని చేసింది ఏవరు?' తనను తాను తర్కించుకుంది సావిత్రి.

గోడల స్థానంలో ఉన్న ఇనుప రేకులను ఎవరో బరబరా గీకిన చప్పుడు. ఆలోచనల్లోంచి తేరుకుని తిరిగి చూసింది సావిత్రి. బయట నుంచి ఎవరో రేకును బల వంతంగా తోస్తున్నట్టనిపించింది. భయంగా చంద్రంను లేపబోయింది. అప్పటికే కండ్లు తెరిచిన చంద్రం, "అవి అంతే పెద్దమ్మా... ఎడారి ఎలుకలు... బల్లులు... పంది పిల్లల లెక్క ఉంటయి. మందలు మందలు తిరుగు తయి," అన్నాడు.

సావిత్రి భయంగా చూసింది.

"అవి ఒక్కటే కావు పెద్దమ్మా... రకరకాల జంతు వులు... పురుగులు. రాత్రి పూటనే తిరుగుతయి.అదిగాక ఈ క్యాంపు ఊరికి దూరంగా ఎడారిలో ఉంది. ఏ పురుగు ముట్టినా కష్టమే. దవాఖానకు పోయేసరికే పాణాలు పోతయి. గోడ అవుతల అవి. ఇవుతల మేము. రాత్రంతా చావు బతుకుల పోరాటమే," విషాదంగా అన్నాడు చంద్రం.

సావిత్రి గుండె మరింత బరువెక్కింది. 'కొడుకు ల్లారా... దేశం గాని దేశంల ఎడారి రాజ్యంల ఎట్లుంటు న్నరురా. మీ గోస వట్టిగవోదు. మిమ్ములనుఈ గతికి తెచ్చినోళ్లకు తప్పక తలుగుతది,' బాధగా అనుకుంది.

తరువాత, 'ఉర్లో ఉన్న నా బతుకు కూడా ఇంతే కదా. ఇక్కడ కనీసం శత్రువు ఎవరో కనబడుతుంది. నాకు ఆ నీడ కూడా కనవడలేదు,' అనుకుంది.

బయటగాలి చప్పుడు. గాలికి లేచిన ఇసుక చప్పుడు. లేచిన ఇసుక ఇనుప రేకులకు తాకిన చప్పుడు. మధ్యమధ్యలో జంతువుల అరుపులు. గోడలను గీరిన చప్పుడు. పైకప్పుపై ఎగిరిన చప్పుడు. ఆ శబ్దాలు పరి సరాలు చూస్తుంటే తన జీవితమే కనిపిస్తుంది. ఇంత బయంకర వాతావరణంలో తన కొడుకు ఎలా తట్టు కున్నాడో ఆలోచిస్తుంటే మరింత భయం వేస్తుంది. ఆ భయంలోంచి తప్పుకోవడానికే కళ్లు మూసుకుంది సావిత్రి.

ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. ఎప్పుడో తెల్లారే ముందు కన్నంటుకుంది. మెలకువ వచ్చేసరికి తెల్లారిపోయింది. గదిలో చంద్రం ఇంకెవరో ఇద్దరు ముగ్గురు మాట్లాడుకుంటున్నారు.

"మా తాత ఎనుకట సంఘం పెట్టి దొరలతోని కొట్లాడిండట. మా పెద్దబాపు అన్నలల్ల తిరిగిండట. మా

నాగరాజన్న గూడా ఎవ్వలకు భయపడక పోతుండె...'' చంద్రం మాటలు వినిపించాయి.

తండ్రి, భర్త మరోసారి మనసులో మెదిలి దీర్ఘంగా నిట్టూర్చింది సావిత్రి. తెలిసీ తెలియని వయసులోనే తండ్రి మరణించినా ఆ మరణం తాలూకు జ్ఞాపకాలు చాలా రోజులు వెంటాడాయి.

తన తల్లి ఏడుస్తూ, ''దొడ్డి కొమురయ్య మరణంతో సాయుధపోరు రగులుకుంది. మీ నాయిన పోరుజెండా ఎత్తుకోని సంఘంల కలిసిండు. దొరలు భూస్వాములు పాణభయంతో పట్నాలకు పారిపో యిండ్రు. ససంత్రమచ్చినంక వాళ్లే రుమీ టోపిలు పెట్టుకుని కాంగ్రెస్ జెండా పట్టుకుని నాయకులుగా ఊర్లె కచ్చిండ్రు. పగబట్టి మీ నాయినను ఊర్లె నుంచి ఎల్లగొట్టిండ్రు. పట్నంల రిక్షా తొక్కుకుంట ఆకలి చావు చచ్చిండు బిడ్డా మీ నాయిన,'' చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

చంద్రం గొంతు పెంచుతూ, ''మా పెద్దమ్మను ఊర్లెనే ఇచ్చిండ్రు. మా పెద్దబాపు పాటలు కైగట్టి పాడు తుండె... అప్పుడు అన్నల జోరుందట. మా తాత లెక్కనే పెద్ద బాపు గూడా దొరలను పల్లెల నుంచి పట్నం తరి మిండట...'' చెప్పుకుపోతున్నాడు. అతని గొంతులో అదో గొప్ప పని అన్న భావన ఉంది. ఒక ఉద్వేగం ఉంది. చంద్రం ఇంకేదో చెబుతున్నాడు.

సావిత్రి మాత్రం అక్కడే ఆగిపోయి ఆలోచిస్తుంది. భర్త చనిపోయి చాలా ఏళ్లు గడిచినా ఆ గాయం ఇంకా పచ్చిగానే ఉంది. ఆ జ్ఞాపకం ఇంకా మనసులోంచి పోలేదు.

ఒక రాత్రి భర్త, ''యునివర్సిటీల పిల్లలందరు గ్రామాలకచ్చిండ్రు. ఊరు ఊరంతా పోరు నడుత్తుంది. ఇప్పుడు వందల గ్రామాలు దొరల పీడన నుంచి విముక్తి పొందినయి. వాళ్లు నన్ను రమ్మంటున్నరు. నిర్బందం పెరిగింది కదా బయట ఉండుడు కూడా ప్రమాదమే...'' అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

తను నెత్తి నోరు మొత్తుకుని చెప్పిన మాటలు కూడా గుర్తుకొచ్చాయి.

''వద్దే వద్దు... ఇప్పటికే తండ్రిని పోగొట్టుకున్న. ఇప్పుడు నిన్ను దూరం చేసుకోను. రెండు మూడేండ్లు బొంబాయిపో.... అందరు మరిచిపోతరు,'' అంటూ బలవంతం చేసి బంబాయి బస్సు ఎక్కించింది కూడా గుర్తుకొచ్చింది.

చంద్రం మిత్రులకు సావిత్రి జీవితాన్ని పరిచయం చేస్తూనే ఉన్నాడు. వాళ్లంతా ఏదో విషాదకథను వింటు న్నట్టు మౌనంగా వింటున్నారు. అటునుంచి ఇటువైపు తిరిగి ముడుచుకుని పడుకుంది సావిత్రి.

భర్త రాసిన చివరి ఉత్తరం కళ్లముందు కదిలింది. 'సహచరి... లాల్ సలామ్. నిన్ను చూడాలని ఉన్నా ఊరికి రాలేని పరిస్థితి. బొంబాయి వచ్చినా పోలీసులు నన్ను వదులలేదు. ఓ పెద్ద తలకాయను పట్టిస్తేనో... ఓ రెండు తుపాకులు పట్టుకొస్తేనో తప్ప బతకనియ్య మంటున్నారు. ఉద్యమానికి ద్రోహం చెయ్యలేను కదా. మృత్యువు నీడలా వెంటాడుతుంది. నిన్ను కలిశాక అన్ని విషయాలు చెప్పుకుందాం. చిన్నోడు జాగ్రత్త.' నాలుగే నాలుగు వాక్యాలు.

ఉత్తరం, ఎన్‌కౌంటర్ వార్త రెండూ ఒకేసారి అందాయి. బొంబాయిలో ఉన్న భర్త ఊరు పక్కన పెద్ద గుట్ట మీద శవమై తేలాడు.

మొదట తండ్రిని భర్తలో చూసుకుంది. తరు వాత భర్తను కొడుకులో చూసుకుంది. పాతిక సంవ త్సరాల తర్వాత కొడుకు మళ్లీ గాయాన్ని కెలికాడు. అప్పటికి చర్చల పేరుతో ప్రభుత్వం పడగనీడను పరి చింది. ఊర్లన్ని మరోసారి ఎరుపెక్కాయి. ముందటిలా ఇల్లు సందడిగా మారింది. సావిత్రికి భయం మొదలైంది. నాగరాజును హెచ్చరించింది. ఎక్కడ ఏం జరిగిందో కాని పాము బుసకొట్టింది. చీమలపుట్ట బెదిరింది. శాంతి చర్చలు విఫలమయ్యాయి.

ఒకనాటి రాత్రి కొడుకు, ''అమ్మా... మంచి అవ కాశం. ఎవరికీ తెలియదు. రాత్రికి రాత్రే లక్షాధికారులమై పోవచ్చు. ఉద్యోగం కూడా ఇస్తమంటున్నరు. మనకు చాలా సింపుల్. ఒక ఇద్దరిని పట్టిద్దాం. జస్ట్ ఒక ఫోన్ కాల్ అంతే,'' రహస్యంగా అంటుంటే ఆశ్చర్యపోయింది సావిత్రి.

అతని మొహంలో ఎక్కడైనా పశ్చాత్తాపం ఉందే మోనని ఆశగా వెదికింది. ఆశ నిరాశ కావడంతో కృంగి పోతూ, ''నిన్ను అనాలో నీ తరాన్ని అనాలో లేక ఒక నిస్సార తరాన్ని తయారుచేసినందుకు వ్యవస్థను అనాలో తెలుస్తలేదురా... ఎవరి కడుపున పుట్టినవో తెలుసునా,'' అంటూ యాష్టపడింది.

అప్పటికే నాగరాజుకు పోలీసులతో దోస్తి. అల వాట్లలో మార్పు. భరించలేకపోయింది సావిత్రి. ఇక్కడ ఉంటే డబ్బు కోసం ఆ పని తప్పక చేస్తాడని భయం వేసింది. వెంటనే నయాన బయాన దుబాయ్ పంపింది.

చంద్రం చెప్పాల్సింది కూడా పూర్తయినట్టుంది. ''పెద్దమ్మా... లే... తెల్లారింది... పోవాలె... ఇది మన ఇండియా లెక్కగాదు. టయమంటే టయమే... నిమిషం కూడా ముందు వెనక ఉండది,'' అన్నాడు.

సావిత్రి లేచి కూర్చుంది. బయట ఉన్న మరో ఇద్దరు ముగ్గురు వచ్చారు.

"నాగరాజు వాళ్లమ్మ," సావిత్రిని చూపిస్తూ వెనక నుంచి ఎవరో అన్నారు.

"అయ్యో... పాపం. ఇంత దూరం ఎందుకు వచ్చింది. మినిస్ట్రీ ఆఫ్ జస్టిస్‌కు క్షమాభిక్ష పెడుతున్నట్టు ఉత్తరం రాస్తే సరిపోయేది," ఎవరో అన్నారు.

"చంద్రం చెప్పిండట... ఆమెనే వినలేదట. కొడుకు శవాన్ని చూడలేదు. కనీసం వాడున్న చోటయినా చూస్తానన్నదట," ఇంకొకరు.

అందరూ చుట్టూ మూగారు. "పెద్దమ్మా... నేనూ చంద్రం మొత్తం సెటిల్ చేసినం. ముందు వాళ్లు ఒక్క పైస ఇయ్యమన్నరు. మేం 'కసాస్' అన్నం. కోర్టు ఉరి శిక్ష వేసింది. వాళ్లు సుప్రీంకు పోయింఁడ్రు. అప్పుడే రంజాన్ వచ్చింది. ఎవలైన దాతలు దొరకుతరని చూసింఁడ్రు. ముస్లీంలకైతే దొరుకుదురు. వీళ్లకు దొరుక లేదు. ఉరితీసే రోజులు దగ్గరపడ్డయి. అప్పుడు కాళ్ల బేరానికి వచ్చింఁడ్రు. వాళ్ల తల్లి రెండు నెలలుగా ఇక్కడనే ఉంది," ఓ వ్యక్తి ముందుకు వచ్చి అన్నాడు.

సావిత్రి అతన్ని గుర్తుపడుతూ, "అరే... రవీ... నువ్వు... నువ్వెందుకచ్చినవురా," అన్నది బాధగా.

రవి బేలగా చూస్తూ, "ఊర్లె బతుకుదెరువు ఎక్క డిది పెద్దమ్మా... బోర్లు వేసి బోర్లవడితిని," అన్నాడు. సావిత్రి అందరి ముఖాల్లోకి చూసింది. ఎవరి మొఖంలో నవ్వులేదు. ఇది అని చెప్పలేని ఒకానొక బాధనే కనిపి స్తుంది. కదిలిస్తే కన్నీటి సముద్రాలు పగులుతాయా అన్నంతగా దుఃఖాన్ని బిగబట్టుకున్నారు.

సావిత్రికి వాళ్లను చూస్తే గుండెను పిండేసినట్ట యింది. ఒక్కొక్కల మొఖాల్లో ఒక్కొక్క చరిత్ర. బిగ్గరగా ఏడవాలనుకుంది. ఏడుపు రాలేదు. పెళ్లయిన నెలకే వలస వచ్చిన రాములు, వస్త వస్తనని కూతురు పెళ్లికి కూడా రాని లింగం, తండ్రి చావుని కూడా చూడని రాయమల్లు, పదేండ్ల నుండి పత్తా దొరుకని అంజయ్య, కాలు విరిగినా ఇంటికి పోని పెంటయ్య... వీరందరినీ మళ్లీ మళ్లీ చూసింది.

ఇంతకు ముందు ఒక్కతల్లి గర్భశోకాన్నే మోసింది. ఇప్పుడు వందల తల్లుల గర్భశోకం తనలో ఇంకిపో యింది. అయినా ఏడుపు రాలేదు. గుండెలో మాత్రం సముద్ర మంత బరువు నిండింది.

"తమ్ముడు నాగరాజు ఉన్నప్పుడు ఎవలకు ఏ ఆపదవడ్డా ముందుకత్తుండె. ఇండియన్ ఎంబసీల నాగరాజు పేరు వింటేనే భయం. వాని గుణమే వేరు. రాజా గుణం," గుంపులో ఓ వ్యక్తి అన్నాడు.

'ఎవలు కల్లివెల్లి అయినా ఇక్కడికే వత్తురు... ఎవలు సచ్చినా వీనికే బాధ. శవాన్ని ఇండియాకు పంపిచ్చేదాక నిద్రవోకపోతుండె. కంపినీ చుట్టు తిరిగి ఎందరికి జీతాలు ఇప్పియ్యలేదు.....ఎందరికి పాస్ పోర్టులు ఇప్పియ్యలేదు' ఇంకో వ్యక్తి గుర్తు చేసు కున్నాడు.

'రేపు చస్తడనంగ పొద్దంత నాతోనే ఉన్నడు. కరీంనగర్ దగ్గర నుస్లాపూర్ నుంచి ఇద్దరు అన్నదమ్ము లచ్చిండిరి. కంపిన్ల జీతం ఇయ్యకుంటె కల్లివెల్లయి బిల్డింగ్ కాంట్రాక్టల పని జేస్తుంఁడ్రట. తమ్ముడు తట్ట మోసుకుంట జారి కిందవడ్డడట. అన్న వచ్చి దవా ఖాన్లకు తీసుకపోదామంటే పోలీసులు పట్టుకుంటరు. పారిపోదామంటే తమ్ముడేనాయె... ఎట్ల...? నాగరాజుకు ఫోన్ జేసిండట. ఇద్దరం కలిసి దవాఖాన్లకు తీసుక పోయినం. ఆనాడు తెల్లారంగనే ఈ ముండకొడుకులు తమ్మున్ని సంపిరి. శవం గూడా దొరకనియ్యకపోయిరి," ఇంకో వ్యక్తి కన్నీళ్లతో గుర్తుచేసుకున్నాడు.

"వాళ్లు శ్రీలంకోళ్లు. అన్నదమ్ములేనట. పిడెకెడు బియ్యం కోసం మనిషిని సంపిరి. భయానికి మస్కట్ పారిపోదామని చూసింఁడ్రు. కాని పాపం దాగుతదా... బార్డర్ల పోలీసులకు దొరికింఁడ్రు..." ఇంకో వ్యక్తి అన్నాడు.

సావిత్రి నిర్వేదంగా చూసుంది. పగిలి పగిలి ఏడ్వా లని మరోసారి ప్రయత్నిం చింది. ఏడుపు రాలేదు. కొడుకు గురించి కొన్ని కొత్త విషయాలు వింటుంది. కొన్ని రోజులు కనిపించడం లేదన్నారు. తర్వాత ఎవరో హత్య చేసి శవాన్ని మాయం చేశారన్నారు. హత్య చేసిన వారికి శిక్ష పడిందన్నారు. కొడుకు కోసం రెండేండ్లు ఏడ్చింది.

కొంత కొంత మర్చిపోతున్న క్రమంలో ఈ దియా ప్రస్తావన వచ్చింది. కొడుకు చావును డబ్బుతో ఖరీదు కట్టడానికి మనసు ఒప్పుకోలేదు. వద్దేవద్దన్నది. హంతకు లకు శిక్ష పడాల్సిందేనన్నది. చంద్రం ఒప్పుకోలేదు. నువ్వు పార్డెన్ లెటర్ రాసివ్వకుంటే నేనే రాసిస్తానన్నాడు. చంద్రం అన్నంత పనిచేస్తాడని తెలుసు. అందుకే జడ్జి ముందే కసాస్ చెప్పడానికి చంద్రంను నమ్మించి ఇక్కడికి వచ్చింది.

కొద్దిసేపు మాట్లాడి సాయంత్రం కలుస్తామని ఎక్కడి వారక్కడ వెళ్లిపోయారు. గదిలో చంద్రం, రవి, సావిత్రి మాత్రమే మిగిలిపోయారు.

'చంద్రం... పెద్దమ్మకు చెప్పినవా... జడ్జి రెండే రెండు మాటలు అడుగుతడట. ఉక్క కసాస్ ఇన్నా తానాజిల్ అని. కసాస్ అన్నదనుకో. ఇన్ని రోజులు మనం కష్టపడిం దంతా సున్న. తానాజిల్ అనాలె. అంటే నేను క్షమిస్తున్నా అన్నట్టు...' రవి అన్నాడు.

'కసాస్... కసాస్...' మనసులో గట్టిగా అనుకుంది సావిత్రి.

''చెప్పిన...'' చంద్రం అన్నాడు.

ఇద్దరూ వంట ప్రయత్నంలో పడ్డారు. సావిత్రి అటూ ఇటూ తిరిగి తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది. ఒక్కసారిగా కళ్లు తిరిగినట్టనిపించాయి. తొమ్మిది కూడా దాటలేదు. ఎండ నిప్పులు కక్కుతుంది. రాత్రంతా చల్లబడ్డ ఇసుకలోంచి వేడి ఆవిర్లు పుడుతున్నాయి. కండ్లు నులుముకొని చేతులు అడ్డం పెట్టుకుని వేళ్ల సందుల్లోంచి చుట్టూ చూసింది. అనంతమైన ఇసుక ఎడారి. అక్కడక్కడా లేబర్ క్యాంపులు. అందరూ పనికి వెళ్లే హడావుడిలో ఉన్నారు. డిసిఎమ్‌లాంటి వాహనాలు లేబర్స్ కోసం క్యాంపుల చుట్టూ తిరుగుతున్నాయి. ఎండకు ఎడారి అద్దంలా మెరుస్తుంది.

కాసేపటికి పూర్తిగా కళ్లు విప్పిన సావిత్రి అక్కడ నిలబడలేకపోయింది. భూమి మీద కాకుండా ఏదో వింతలోకంలో ఉన్నట్టుగా, చుట్టూ నిప్పులగుండం మండుతున్నట్టుగా అనిపించింది. కాళ్లు కాలుతున్నాయి. క్షణాల్లో చెమటతో తడిసిపోయింది. భయం భయంగా లోపలికి వచ్చింది. గదిలో ఏసీగాలి శరీరాన్ని చల్లబరిచినా మనసు రగిలిపోతూనే ఉంది. ఇప్పుడైనా ఏడుద్దామనుకుంది. కాని దుఃఖం రాలేదు.

''ఈ ఎండలో ఎడారిలో ఎట్ల పని జేస్తరురా...'' బాధగా అడిగింది సావిత్రి.

వంట చేస్తున్న చంద్రం నవ్వుతూ. ''ఇప్పుడేం చూసినవు పెద్దమ్మా... జూన్ జులైల పగటియాల్ల చూడు... మాడిపోవుడే... దుబాయ్‌లున్నడంటే ఏదో అనుకుంటరు. ఇక్కడ సుక్కలు కనవడుతయి,'' అన్నాడు.

''పొట్టతిప్పలు పెద్దమ్మా... ఉన్న ఊర్లె పని లేదాయె. పనున్న జాగల సుఖం లేదాయె. ఏదో కొన్ని రోజులు ఎల్లదియ్యాలె...'' నవ్వడానికి ప్రయత్నించాడు రవి. నవ్వు రాలేదు.

నీరసంగా వచ్చి పక్కమీద వాలిపోయింది సావిత్రి. రవి చంద్రం వంట చేస్తూ ఎవరెవరిని కలవాలో ఏమేం చేయాలో మాట్లాడుకుంటున్నారు.

''మనం ఇప్పుడు ఎంబసీకి పోవుడా...'' రవి అడిగాడు.

'లేదు కోర్టుకే. మనం పార్డెన్ లెటర్ ఇయ్యంగనే వాళ్లు కోర్టుల డబ్బు జమ చేస్తరు. కోర్టు డబ్బు మనకు ఎప్పుడిస్తదో తెలువది,'' చంద్రం చెప్పాడు.

'కోర్టుల వాళ్లు కట్టుడు, కోర్టు మనకు ఇచ్చుడు... ఇది కొద్దిగ లేటే ! డైరెక్టుగా వాళ్లను డబ్బు మనకే ఇయ్యిమంటే సరిపోతుండె,'' రవి అన్నాడు.

చంద్రం అన్నం కలుపుతూ, ''కుట్టేటోడు కుడితెనే చెవినొయ్యది. మనకు వాళ్లు వింటరా... మొదలు డబ్బులే లెవ్వన్నరు. తర్వాత లక్షరూపాయలిత్తనన్నరు. వాళ్లను ఎంత ఒత్తిడి చేస్తె దిగివచ్చినరనుకున్నవు. మనకే ఇయ్యిమంటె ఐదు తక్కువున్నయి పది తక్కువున్నయని ఏడుపులు బొబ్బలు...'' అన్నాడు.

ఇద్దరి మాటలు వింటూ కళ్లు మూసుకుంది సావిత్రి. ఇక్కడి కష్టాలు జీవితాలు చూస్తుంటే కొత్త ఆలోచనలు వస్తున్నాయి. ఊరిలో ఉన్నప్పుడు గర్భశోకంతో ఒంటరిగా ఎడారివైపు చూసింది. ఇప్పుడు ఎడారి నుంచి గ్రామాలు వైపు చూస్తుంటే వేలమంది తనలాంటి తల్లులు కనిపిస్తున్నారు. బాధను వ్యక్తి నుంచి సమూహానికి సమూహం నుంచి వ్యక్తిగతానికి చూస్తుంది.

''పెద్దమ్మా... వంట రెడీ... లేచి తయారవ్వు. మనం కరక్టుగా పన్నెండు గంటలకు అక్కడుండాలే. చెప్పిన గదా. ఇక్కడ టైమంటే టైమేనని...'' చంద్రం అన్నాడు.

అప్పుడే కారు హారన్ మోగింది. ''అగో... కారు కూడా వచ్చింది,'' రవి అన్నాడు.

అరగంటలో ముగ్గురు రెడీ అయి కారులో కూర్చున్నారు. మరో అరగంటలో కోర్టు ముందున్నారు.

కారు దిగుతుండగా మరోసారి గుర్తుచేస్తూ, ''పెద్దమ్మా... ఇక్కడ వాదనలుండయి మనమేం మాట్లాడ్డానికి కూడా వీలుండదు. 'తానాజిల్' అంతే! ఒక్కటే మాట,'' అన్నాడు చంద్రం.

బాధగా చంద్రంవైపు చూసింది సావిత్రి. వీడిని మోసం చేస్తున్నానా అని మరో సారి అనుకుంది.

''ఓరే... చంద్రం నా కొడుకును చంపినవాడు బతకడానికి వీల్లేదు. వాడి చావును కూడా అమ్ముకునేంత నీచురాలిని కాదు... నేను ఎవరినీ క్షమించనురా,'' అని ఈ చివరిక్షణంలోనైనా చెప్పాలనుకుంది. చెప్పడానికి మనసొప్పలేదు. చెబితే కోర్టు లోపలికి కూడా తీసుకపోడని తెలుసు. మనసులోని భావాలు మనసులోనే దాచుకుంటూ ముందుకు నడిచింది.

కోర్టుహాలంటే ఎంతో పెద్దగా ఉంటుందనుకుంది. నాలుగు గదులు ఒక హాలుతో ఉన్న చిన్న భవంతి. చుట్టూ ప్రహారిగోడ. ఎత్తైన కర్జూరపు చెట్లు. ఒకరిద్దరు తప్ప సందడే లేదు. హాలు ముందు వరండాలో ఒక స్త్రీ మాత్రం దీనంగా కూర్చుంది. రూపం కట్టుబొట్టు తనలాగే ఉంది. ఆమెను చూడగానే తనలాగే కడుపుకాలిన తల్లి అనుకుంది.

చెదిరిన జుట్టు, మాసిన బట్టలు, పీక్కుపోయిన మొహం. కదిలిస్తే కట్టలు తెంచుకునేంత దుఃఖంతో

శోకదేవతలా ఉంది. ఆమె వెళ్లి పక్కనే కూర్చుంది సావిత్రి.

"పలకరిద్దామా... ఏమని పలకరిద్దాం," అనుకునే లోపే ఆమెనే తెలుగులో "మీరు ఆంధ్ర కదా..." అన్నది.

ఆమె వైపు వింతగా చూసి, "అవును," అంది సావిత్రి.

"మాది సిరిలంక..." యాసగా చెప్పింది ఆమె.

వెంటనే ఆమెను పోల్చుకుంది సావిత్రి. క్షణకాలం మనసు జగుప్స, కోపంతో రగిలిపోయింది. ఆమె కుడా సావిత్రిని పోల్చుకున్నట్టు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. ఆమె కళ్ల వెంట నీళ్లు టపటపా రాలుతున్నాయి.

'ఏడవాల్సింది నేను. ఈమెందుకు ఏడుస్తుంది,' అనుకుంది సావిత్రి.

ఆమె ఏదో చెప్పాలని నోరు తెరిచింది. ఏవో కాగితాలతో అప్పుడే అక్కడికి వచ్చిన రవి, చంద్రంలను చూసి ఆగిపోయింది. ఆమెతో సావిత్రిని చూసిన చంద్రం కంగారుగా, "పెద్దమ్మా," అంటూ పిలిచాడు.

సావిత్రి చంద్రం వద్దకు వెళ్లింది. ఆమెను దూరంగా కర్జూరపు చెట్టు నీడలోకి తీసుకెళ్లి కూర్చోబెట్టి సంతకాలు చేయిస్తూ, 'మనం ఇక్కడి నుంచి వెళ్లేవరకు ఆమెతో కలవకూడదు మాట్లాడకూడదు," అన్నాడు దురుసుగా.

"అదేందిరా... ఎందుకు? ఇంతకి ఆమె ఎవరు," అడిగింది సావిత్రి తెలియనట్టుగా.

"చంపినోళ్ల తల్లి. రెండు నెలలాయె వచ్చి. ఇక్కడ అరబ్బుల కాళ్లు మొక్కుతుంది. ఎవలకేం ముద్దు. అంగట్ల అయ్యా అంటే ఎవలకు పుట్టినవు బిడ్డా అన్నట్టు ఇక్కడ ఎవలు పట్టించుకుంటరు...!" చంద్రం అన్నాడు.

"అబ్బో... వీళ్లదో పెద్ద చరిత్ర. నాకు శ్రీలంక వాళ్లు దోస్తులున్నరు గదా...! వాళ్లు చెప్పిండ్రు. అక్కడ గూడా మనలెక్కనే అన్నలున్నరట. పోలీసుల భయానికే వీళ్లు ఇటు వచ్చిండ్రట," రవి అన్నాడు.

"ఈ ముసలిది మామూలుదా. ఏడ్చి తుడిచి నన్నే బుట్టలేద్దామని చూసింది. నేను వింటనా. ఒక్క పైస తక్కువున్నా ఉరి తీసుడేనని కచ్చితంగా చెప్పిన. అప్పుడు గాని రోగం కుదురలేదు," చంద్రం అన్నాడు.

సావిత్రి వారి మాటలు వింటుంది. వింటుంటే కడుపు కరుగుతుంది కండ్లు చెమరుస్తున్నాయి.

రవి, చంద్రంలు ఆమె గురించి ఇంకా ఏవేవో మాట్లాడుకుంటున్నారు. సావిత్రి వారి మాటలను ఒక్కొక్కటిగా అతుక్కుంటుంది. వాటితో ఆమె జీవన నేపథ్యాన్ని అల్లుకుంటుంది. ఆమెను చూస్తుంటే తనను తాను చూసుకున్నట్టు, తన చరిత్ర తాను వింటున్నట్టుగా ఉంది. శత్రువెవరో తెలియక చీకట్లో ఆత్మరక్షణ కోసం తండ్లాడు తున్నట్టుగానే ఉంది.

ఎవరో పిలిచినట్టున్నారు. ఆమె లోపలికి వెళ్లింది. తర్వాత పోలీసువ్యాన్ వచ్చి ఆగింది. నలుగురు పోలీసులు ఇద్దరు యువకులను లోనికి తీసుకెళ్లారు. ఓ పోలీసు వచ్చి రవిని, చంద్రంను తీసుకెళ్లాడు. ఆ యువకులను చూసింది సావిత్రి. ఇద్దరూ అటు ఇటుగా నాగరాజు వయసువారే.

సావిత్రి ఒంటరిగా మిగిలిపోయింది. చెవులు బద్దలయ్యే నిశ్శబ్దం. ఎక్కడో దూరాన ఒకటి రెండు వాహనాలు అప్పుడప్పుడూ దూసుకుపోతున్న చప్పుడు తప్ప ఎక్కడ ఏ శబ్దం లేదు. చుట్టూవేడి ఆవిర్లు. తళతళ మెరుస్తున్న ఎండ. ఉక్కపోతకు అక్కడ నిలబడలేక కోర్టుహాలు నీడలోకి వచ్చింది. కొద్దిసేపటికి శ్రీలంక మహిళ కూడా వచ్చింది. బయట నిలబడి కుమిలి ఏడుస్తుంది.

ఈసారి ఆమెను పరిశీలనగా చూసింది సావిత్రి. సమాన ఫ్రీక్వెన్సీ గల రెండు వస్తువుల్లో ఒకటి మోగితే మరొకటి అనువాదం చెందినట్టు ఆ ఏడుపు సావిత్రి గుండెలో కూడా సుడులు తిరుగుతుంది.

'ఎన్ని ఎడబాట్లలో నేనిలా కుమిలి కుమిలి ఏడ్వలేదు. దేశమేదైనా ఏడుపు ఇలాగే ఉంటుందా...' అనుకుంది. చూస్తుంటే ఆ ఏడుపుతో తనూ అనుసంధానం చెందుతుంది. గుండె తల్లడమల్లడమయింది.

ఏడుస్తూ సరాసరి సావిత్రి దగ్గరికే వచ్చింది ఆమె. ఈసారి ఆమె ముఖాన్ని పరిశీలనగా చూసింది సావిత్రి. చిన్నవయసే కాని వయసు పైబడినట్టుంది. మొహంలో పౌరుషం, పట్టుదల ఉంది. చూపులో రోషం ఉంది.

'ఇక్కడ చట్టాలు ఏమి ఉండాయో తెలిసిలేదు. కిందటి మాపుసరి దాక ఇరువదున్నయిదు లక్షలే అని ఉండినారు. ఈపూట వచ్చేతలికి ఒకటి సగం లక్షల రొక్కం ఎక్కువ కావలసి ఉండాది అంటున్నారు. ఇప్పటి ఇప్పుడు ఎక్కడి కాడ నుండి ఎత్తుకు తెచ్చి ఇచ్చి వుండాది. మా తాత తంద్రై ఉన్న మద్రాసి. పొట్ట తిండి కోసరం తేయాకు తోటలకు సంబళగాడుగా సిరిలంక వెళ్లి ఉండాడు. ఏ గడియలో ఈ భూమి మీదకు పుట్టి వుండానో బతుకంతా కంపరమే...' అంటూ ఆగి సావిత్రి కళ్లలోకి చూసింది.

సావిత్రికి ఆపుకుందామన్నా ఆగని దుఃఖం. అయినా ఆపుకుని ఆమెనే చూస్తుంది.

మరింత దగ్గరగా వచ్చిన ఆమె అదే యాసలో మాటలను వెతుక్కుంటూ వెతుక్కుంటూ వెక్కిళ్ల మధ్య,

''నాలుగు తరములుగా దేవనగట్టు గడ్డ మీద పాము లోళ్లుగా బతికి ఉండినా మేము అక్కడ పరాయివోళ్లమే. ఆ పోరాటం ఇంకా సాగతా ఉండినాది. నాదు భర్తాలుడు పోరాటంలో అజ్ఞాతవాసిగా వెళ్లి ఉంటే గవర్నమెంటు తలకు వెలకట్టి ఉండారమ్మ...'' అంటూ చెప్పలేక ఆగింది.

సావిత్రి కంటి నుండి వలవలా కన్నీళ్లు.

'ఇదేమిటీ... ఎండిపోయాననుకున్న కళ్లల్లో నీటి ఊటలు. గడ్డ కట్టిందనుకున్న హృదయంలో కదలికలు. నిన్నటి నుంచి కరగని గుండె ఇప్పుడు కరుగుతుం దేంటీ...' అనుకుంది సావిత్రి.

కోర్టు హాలు నుండి బయటకు వచ్చినట్టున్నాడు చంద్రం. కోపంగా, ''పెద్దమ్మ,'' అని అరిచాడు. సావిత్రి విననట్టే ఉంది.

శ్రీలంక మహిళ సావిత్రి రెండు చేతులను అందు కుంది. ఏడుస్తూనే వెక్కిళ్ల మధ్య, ''నా భర్త ఎలాగూ బతికి బయటపడలేడు. కనీస మాత్రం పిల్లలనైనా బతికించుకుందామని అక్కడ తావులేక ఇక్కడికి పంపి ఉండినాను. కాని కాలం కలిసి వచ్చిలేదు. ఆకలికి తట్టు కోలేక ఓ రాత్రి మబ్బు ముసుగులో బియ్యం గోదాము లోకి నా కొడుకులు దొంగతనంకు వెళ్లి ఉండారట. సెక్యూరిటీ గార్డుగా నీ కొడుకు ఉండి ఉండాడట. లోతుగా అర్థం చేసుకొని ఉండు. సంపింది నా కొడుకులు కాదు. సచ్చి ఉంది నీ కొడుకు కాదు. వీరిని ఇక్కడకు రప్పించి చేతులకు రగతం అంటకుండా హత్యలు చేయించి ఉండారే... ఆ రణబందులు వేరుగా ఉన్నారు. అది గుర్తించి చూడు...'' ఆమె కంఠంలో కొద్దిగా తీవ్రత. కళ్లు తుడుచుకుంది. గాలికి ఎగురుతున్న వెంట్రుకలను గట్టిగా ముడివేసుకుంది.

చంద్రం సావిత్రిని గట్టిగా పిలుస్తూనే ఉన్నాడు. సావిత్రి మాత్రం పుట్టెడు దుఃఖంతో ఆమెలో తననే చూసుకుంటుంది. ఒక్కసారిగా ఆమె గంభీరంగా మారి పోయింది. శూన్యంలోకి చూస్తూ నిర్వేదంగా, ''నేను సోలిపోలేదు. నా పిల్లలు ఈ ఎడారి రాజ్యంలో ఉట్టిగా చచ్చి ఉండాకంటే అక్కడకు వెళ్లి ప్రజల కోసరం చచ్చి ఉండుడు మేలనుకున్నాను. రెండు పులుల కోసరం ఒక పులిని చంపాలనుకున్నాను. అందుకో సరమేనమ్మా... వీరి తండ్రిని నగదు రొక్కముకు మిలటరీకి నేనే పట్టిచ్చి ఉండాను ఈ రొక్కం అదే...'' ఆమె ఆగిపోయింది.

సావిత్రి పక్కున పగిలింది. కడుపులోంచి, నాభి లోంచి, నరనరాల్లోంచి పొంగిన దుఃఖం రోదనగా మారింది. పరిసరాలను మరిచి ఆమెను గుండెకు హత్తుకుని బావురుమంది. పగిలి పగిలి ఏడ్వడం మొదలుపెట్టింది.

''ఏయ్ ఎవరిది... ఎందుకేడుసన్తన్నరు,'' అరబ్బీలో ఎవరో గట్టిగా అరిచారు.

చంద్రం, రవి ఇద్దరూ కంగారుగా పరుగెత్తు కొచ్చారు. ఆమె సావిత్రి తలను నిమిరింది. కన్నీళ్లు తుడిచింది. ఆపుకోలేని దుఃఖాన్ని గుర్తించి చివరి కన్నీటి బొట్టు కారిపోయే వరకు హత్తుకుని ఆసరాగా నిల బడింది.

''పెద్దమ్మా... నీకు పిచ్చా... ఇక్కడో కత జేత్తు న్నవ్... ఊకో,'' కోపంగా అంటూ సావిత్రిని పక్కకు లాగాడు చంద్రం. ఏకమైన ఇద్దరు వేరయ్యారు. గోడ పక్కగా ఒకటిగా వాలుగా పడ్డ వారి నీడ కూడా వేర యింది.

ఏడ్చి ఏడ్చి సావిత్రి పూర్తిగా తెప్పరిల్లింది. గుండె లోంచి కొండంత బరువు దిగినట్టయింది. ఏండ్లకేండ్లుగా గడ్డకట్టిన దు:ఖం కరిగిపోయాక మనసు గాలిలో తేలుతున్నట్టు తేలికయింది.

'అమ్మా.... తాయీ... రొక్కం చాలి ఉండల్యాదు. గొంత దయ ఉంచి నా బిడ్డల పాణాలు దానంచేసి ఉండమ్మా... నీకు అర్థం అయ్యే ఏ రకంగా చెప్పి ఉండాలో నాకు తెలిసి వచ్చిలేదు...' అంటూ తన వద్ద వున్న డబ్బు మూటను సావిత్రి చేతిలో పెట్టింది. సావిత్రి వాటిని అందుకోలేదు. కింద పడబోతుంటే చంద్రం అందుకున్నాడు.

సావిత్రి చంద్రం చేతిలోని మూటను లాక్కుని ఆమె చేతిలో పెడుతూ, ''నాకు నయాపైసా వద్దు, నీ బిడ్డలను దానం చెయ్యను. రెండు పులులను దానం చేస్తాను,'' అంటూ ఆమె చేతిని పట్టుకుని కోర్టు హాలు వైపు నడిచింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 జూన్ 2013*

